క్రీస్తు పలుకులే శిరోధార్యంగా..

- మరియ మాత జీవితమే స్ఫూర్తిగా..
- ఆధ్యాత్మిక సుగంధం వెదజల్లుతున్న పునీత ఆంథోనీ చర్చి
- నేడు ప్రత్యేక 'గుడి పండగ'

దాబాగార్డెన్స్: క్రీస్తు పలుకులే శిరోధార్యంగా.. మరియ మాత జీవితమే స్ఫూర్తిగా.. నూరేళ్లు పూర్తి చేసుకుని ఆధ్యాత్మిక సుగంధం వెదజల్లుతూ క్రైస్తవులకు ఆలంబనగా నిలుస్తోంది పునీత అంథోనీ చర్చి. ఎప్పుడో 1917లో రూపుదిద్దుకున్న ఈ చర్చి శతాబ్ది ఉత్సవాలను కొన్నేళ్ల కిందటే జరుపుకుంది.

కేవలం రూ. 9 వేలతో నిర్మాణం..

జగదాంబ జంక్షన్‌కు కూతవేటు దూరంలో గల పునీత ఆంథోనీ దేవాలయం 1917లో కేవలం రూ. 9 వేల ఖర్చుతో నిర్మితమైంది. నేడు ఎంతో మందికి ఆపన్నహస్తం అందిస్తోంది. మరెంతో మంది విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ, ఆధ్యాత్మికత నేర్పుతోంది.

పునీత ఆంథోనీ పేరు ఎలా వచ్చిందంటే..

విశాఖపట్నం ఒకప్పుడు ఐరోపా దేశాల వారికి ఆటపట్టుగా ఉండేది. మన దేశానికి వ్యాపారం కోసం వచ్చిన డచ్, పోర్చుగీసు, ఆంగ్లేయులు అధిక సంఖ్యలో విశాఖలో జీవించేవారు. వారంతా క్రైస్తవులే. దీంతో వారి ఆధ్యాత్మిక అవసరాల కోసం చర్చి ఏర్పాటు చేసుకోవాలని భావించారు. క్రీ.శ.1852లో రెవ.టిస్సోర్ ప్రకాశరావుపేటలో చిన్న ఇంటిని అద్దెకు తీసుకుని దైవ కార్యక్రమాలు ప్రారంభించారు. తర్వాత అన్‌స్లిమ్‌రేయ్ చాపెల్‌లో ప్రార్థనలు నిర్వహించారు. ఆయన తర్వాత జేబీ గాంటియర్ గుడి బాధ్యతలు తీసుకున్నారు. అప్పటికే భక్తుల సంఖ్య అధికమవడంతో జగదాంబ జంక్షన్‌లో నూతన దేవాలయాన్ని 1917లో పూర్తి చేశారు. అప్పటి బిషప్ రెవ. జీన్ మెరిక్లైయర్ ఆ నిర్మాణానికి పునీత ఆంథోనీ దేవాలయంగా నామకరణం చేశారు. క్రీస్తును ప్రేమతో పెంచిన ఇటలీకి చెందిన పునీత ఆంథోనీ పేరును చర్చికి పెట్టారు.

మంగళవారం ప్రత్యేకం..

పునీత ఆంథోనీ తన విశిష్ట సేవలతో సెయింట్‌గా గుర్తింపు పొందారు. కొన్ని శతాబ్దాల కిందట ఆమె జూన్ 13వ తేదీ, మంగళవారం దేహం చాలించారు. ఈ నేపథ్యంలో ప్రతి మంగళవారం నిర్వహించే ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు దాదాపు 2 వేల మంది భక్తులు ఈ చర్చికి నేటికీ వస్తుంటారు. దీంతో పాటు ఏటా జూన్ 13వ తేదీన కూడా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ పునీత ఆంథోనీ సేవల్ని స్మరించుకుంటారు.



సెయింట్ ఆంథోనీ చర్చి

1923 నుంచి విద్యాసేవ..

ఈ చర్చి దినదినాభివృద్ధి చెందుతూ వచ్చింది. దేవాలయ సేవలు మరింత విస్తృతం చేస్తూ 1923లో చర్చి ఆవరణలోనే పాఠశాల నెలకొల్పారు. తర్వాత 10 ఎకరాల విస్తీర్ణంలో చర్చి ప్రాంగణంలోనే ఒకవైపు దేవాలయం, మరో వైపు విద్యాలయం ప్రారంభించారు. అప్పటి మిలిటరీ నాలుగో బెటాలియన్‌కు చెందిన గుర్రాలను అధిక సంఖ్యలో వరుసగా దేవాలయం ముందు ఉంచడంతో ఇది 'లైన్‌గుడి'గా కూడా ప్రసిద్ధి చెందింది. 1934లో ఈ ప్రాంగణంలోకి బిషప్ హౌస్‌ను కూడా తీసుకొచ్చారు. అప్పటి నుంచి ఫాదర్ ఇక్కడ పూజలు నిర్వర్తిస్తున్నారు. నగరంలోని చర్చిలకు బిషప్‌గా ప్రస్తుతం డాక్టర్ ఉడుముల బాల కొనసాగుతున్నారు.

> **భక్తుల సహకారం మరువలేనిది..**
>
> చర్చి అభివృద్ధిలో భక్తులు అందిస్తున్న సహకారం మరువలేనిది. ఈ దేవాలయం ఇలాంటి ఎన్నో వసంతాలు పూర్తి చేసుకోవాలి. దాని కోసం అహర్నిశలు శ్రమిస్తాను. చర్చి ఫాదర్‌గా సేవలందించడం సంతోషంగా ఉంది. ప్రతి ఒక్కరూ శాంతిని చాటాలి.
>
> – బాలశౌరి, చర్చి విచారణ గురువు, సెయింట్ ఆంథోనీ చర్చి

13వ తేదీ కార్యక్రమాలివి..

పునీత ఆంథోనీ (గుడి పండగ) సేవల్ని స్మరించుకుంటూ శుక్రవారం ఉదయం 7 గంటలకు తెలుగులోనూ, 9 గంటలకు ఇంగ్లీషులోను పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు సెయింట్ ఆంథోనీ చర్చి నుంచి పుర ప్రదక్షిణ ప్రారంభమవుతుంది. అది దిబ్బలపాలెం, జగదాంబ జంక్షన్, దండుబజార్ అప్‌రోడ్డు, భుజంగరావుపేట, రామజోగిపేట, ఆంథోనీనగర్, సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల మీదుగా తిరిగి చర్చికి చేరుకుంటుంది. సాయంత్రం 6 గంటలకు విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ ఉడుముల బాల కృతజ్ఞతా బలిపూజ నిర్వహిస్తారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.



పునీత ఆంథోనీ

పింఛన్ ఇప్పించండి మహాప్రభో!

ఏడాది కాలంగా సచివాలయం చుట్టూ మహిళ ప్రదక్షిణలు



పింఛన్ మంజూరు చేయాలని వేడుకుంటున్న చోటీ బీబీ

అల్లిపురం: భర్త చనిపోయాడు.. కూతురు పెళ్లీడుకు వచ్చింది.. కుమారుడికి సరిగ్గా కనిపించదు.. ఆదాయం అంతంత మాత్రమే.. కాస్త కనికరించి పింఛన్ ఇప్పించండి మహా ప్రభో అంటూ జీవీఎంసీ 34వ వార్డు అచ్చియ్యమ్మపేటకు చెందిన చోటీ బీబీ వేడుకుంటోంది. తమకు ఒక్క పూట భోజనం కూడా కష్టంగా ఉందని, బతుకు వెళ్లదీయటం కష్టంగా ఉందని ఆమె గత ఏడాది కాలంగా అచ్చియ్యమ్మపేట సచివాలయ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తోంది. అయినప్పటికీ తమను ఎవరూ కరుణించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది. కొత్త పింఛన్ కోసం దరఖాస్తు చేద్దామంటే ఇప్పుడు కాదని చెబుతున్నారని ఆమె వాపోతోంది. కేవలం రేషన్ బియ్యంతోటే బతుకు వెళ్లదీస్తున్నామని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త పింఛన్ మంజూరు చేయాలని ఆమె చేతులు జోడించి వేడుకుంటోంది.

నేటి నుంచి ఇగ్నో టెర్మ్ ఎండ్ ఎగ్జామ్స్

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ టెర్మ్ ఎండ్ ఎగ్జామ్స్ గురువారం నుంచి ప్రారంభమైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల తరపున ఇగ్నో కో ఆర్డినేటర్ డాక్టర్ కేఎల్ శిరీష తెలిపారు. హాల్ టికెట్లు https:// ignou. samarthi. edu. in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రానికి సామగ్రి అందజేత



బకెట్లు, డస్ట్‌బిన్లు అందజేస్తున్న శివకుమార్

దాబాగార్డెన్స్: జిల్లా పరిషత్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన శివకుమార్ దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రానికి అవసరమైన బకెట్లు, డస్ట్‌బిన్లు, స్టూల్స్ వంటి ప్లాస్టిక్ సామగ్రిని గురువారం విరాళంగా అందజేశారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు వీఎస్ పద్మనాభరాజు, ఎంఆర్‌డీ రాజు, రాజేశ్వరరావుకు వాటిని శివకుమార్ అందజేశారు.

జగన్నాథునికి వైభవంగా జ్యేష్ఠాభిషేకం



జ్యేష్ఠాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు, ఈవో రాజగోపాల్‌రెడ్డి

దాబాగార్డెన్స్: టౌన్ కొత్తరోడ్డులో వేంచేసిన జగన్నాథస్వామి దేవస్థానంలో గురువారం స్వామి వారికి జ్యేష్ఠాభిషేకం వైభవంగా నిర్వహించారు. అనంతరం రెండు వారాల పాటు స్వామిని ఉక్కులో పెట్టి ఈ నెల 26 ఉదయం నేత్రోత్సవం కార్యక్రమంతో స్వామి పున: దర్శనాలు ప్రారంభమవుతాయి. అభిషేకానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో టి. రాజ్‌గోపాల్‌రెడ్డి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ మాజీ ఉద్యోగికి ఏయూటీడీ సేవలు



తల్లి బాణాల లక్ష్మికి కృష్ణారావును అప్పజెప్పిన ఏయూటీడీ సిబ్బంది

దాబాగార్డెన్స్: ఉమ్మడి విశాఖ జిల్లా పరవాడ మండలానికి చెందిన బాణాల కృష్ణారావు స్టీల్‌ప్లాంట్‌లో ఏజీఎంగా విధులు నిర్వహిస్తూ స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. అతని మానసిక ఆరోగ్యం బాగులేక రోడ్డున పడడంతో ద్వారకా పోలీసులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో ఏయూటీడీ సిబ్బంది వెళ్లి అతన్ని ఈ ఏడాది ఫిబ్రవరి 8న తీసుకొచ్చి జీవీఎంసీ టీఎస్ఆర్ షెల్టర్‌లో వసతి కల్పించారు. శ్రద్ధా ఆస్పత్రి అందించిన వైద్యంతో కోలుకున్నారు. తాను వెళ్లిపోతానని గొడవ చేస్తుండడంతో తల్లి బాణాల లక్ష్మిని రప్పించి అప్పగించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



మందులు అందజేస్తున్న డాక్టర్ సూర్యతేజ

దాబాగార్డెన్స్: స్నేహ సంధ్య ఏజికేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పాతనగరంలోని స్వామి వివేకానంద సంస్థలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రతి నెలా రెండో గురువారం నిర్వహించే ఈ శిబిరంలో అధిక సంఖ్యలో పాతనగర వాసులు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ సూర్యతేజ పర్యవేక్షణలో తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నాయని, క్రమం తప్పకుండా మందులు వేసుకుని, సమయానికి ఆహారం తీసుకోవాలని, వ్యాయామం చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గుండెకి సంబంధించిన పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఈసీజీ, ఎకో పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని, స్థానికులు ఈ వైద్య సేవలు ఉపయోగించుకోవాలని కోరారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కార్యక్రమంలో పుండరీకాక్షయ్య, ప్రసాద్‌నాయుడు, కమల ప్రియ, సుమతి, సాయి తదితర వైద్య బృందం పాల్గొంది.

శ్రీరామ ఆంధ్ర యువజన సమాజం ఆధ్వర్యంలో..

అల్లిపురం: శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం, శ్రీ గౌరీ సేవా సంఘం ఆవరణలో గురువారం బంగారుమెట్ట వాసన్ ఐ కేర్ సెంటర్, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ సంయుక్తంగా ద్వారకానగర్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో బీపీ, షుగర్ టెస్టులు ఉచితంగా నిర్వహించారు. అవసరమైన వారికి వాసన్ ఐ కేర్ సెంటర్ సిబ్బంది పరీక్షలు చేపట్టారు. సుమారు 200 మంది వైద్య సేవలు వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం ప్రెసిడెంట్ భీశెట్టి హనుమంతరావు, లయన్స్ ద్వారకానగర్ క్లబ్ మెంబర్లు పాల్గొన్నారు.

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలి

బీచ్‌రోడ్డు: స్టీల్‌ప్లాంట్‌లో అక్రమంగా తొలగించిన 4,500 మంది కాంట్రాక్ట్ కార్మికుల్ని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు డి. ఆదినారాయణ డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గురువారం ధర్నా నిర్వహించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా విశాఖ స్టీల్ పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. 40 ఏళ్లుగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కి సొంత గనులు కేటాయించకపోవడం వల్లే నష్టాలు చవిచూస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని రక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం. మన్మథరావు ఉపాధ్యక్షుడు ఎస్‌కే రెహ్మాన్, కె. సత్యనారాయణ, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్రావు, కార్యదర్శులు పి.చంద్రశేఖర్, పడాల గోవిందు, నాగభూషణం, సీహెచ్ కాసుబాబు, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ సభ్యులు

వేతనాలు పెంచాలని మేయర్‌కు వినతి

దాబాగార్డెన్స్: వేతనాలు పెంచాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు గురువారం మేయర్ పీలా శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా ఇంజినీరింగ్ విభాగంతో పాటు ఇతర ఉన్నతాధికారుల వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు విధులు సక్రమంగా నిర్వహిస్తూ, ఏ అధికారికి ఎటువంటి ఆటంకం కలగకుండా పని చేస్తున్న తమకు ఎటువంటి గుర్తింపు లేదని, జీవీఎంసీ పబ్లిక్ హెల్త్ డ్రైవర్లు, వర్కర్లకు వేతనాలు పెరిగాయని, వారితో సమానంగా రూ.24,500 పెంచేలా చర్యలు చేపట్టాలని ఆ వినతిలో పేర్కొన్నారు. మేయర్ స్పందిస్తూ న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు తెలిపారు.



వినతి పత్రం అందజేస్తున్న ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు

రక్తదాన శిబిరంలో దాతలు పాల్గొనండి

దాబాగార్డెన్స్: ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా జైభీమ్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14న నిర్వహించనున్న రక్తదాన శిబిరంలో రక్తదాతలు పెద్ద ఎత్తున పాల్గొనాలని జైభీమ్ సంస్థ కన్వీనర్ కోన ప్రకాష్ తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి కేజీహెచ్ ఓపీ గేటు ఎదురుగా చోడిమళ్ల కాంప్లెక్స్ మొదటి అంతస్తులోని మైక్రో ల్యాబ్ సంస్థలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరంలో రక్తదాతలు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసాలు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నెహ్రూనగర్, ఆరిలోవ కాలనీ, వివేకానందనగర్, సంతపాలెం తదితర ప్రాంతాల్లోని అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు వారి తల్లిదండ్రుల సమక్షంలో టీచర్లు అక్షరాభ్యాసాలు జరిపించారు. కార్యక్రమాల్లో పలు అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు క్రియా యోగ ధ్యానంపై ప్రసంగం

దాబాగార్డెన్స్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సామరస్యం, శాంతి లక్ష్యంగా విశాఖలో యోగదా సత్సంగ ధ్యాన కేంద్ర సారథ్యంలో ఈ నెల 14న క్రియా యోగ ధ్యానంతో ఆనందమైన జీవితం పేరిట కార్యక్రమం నిర్వహించనున్నట్టు కేంద్రం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు నగరంలోని సిరిపురం జంక్షన్ వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనా వేదికగా నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా నిర్వాహకుడు స్వామి స్మరణానంద గిరిచేపై ప్రత్యేక ప్రసంగం ఉంటుందన్నారు. ప్రసంగం అనంతరం ధ్యాన పద్ధతులు నేర్చుకోవాలన్న ఆసక్తి ఉన్న వారు యోగా సత్సంగ పాఠాలకు దరఖాస్తు చేసి, తెలుగు, ఇంగ్లీషు భాషల్లో లభ్యమయ్యే స్వామిజీ ధ్యాన పద్ధతులు నేర్చుకోవచ్చని కేంద్రం నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు 7569293174, 8885804667 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్ శ్రీనివాసరావు తదితరులు

దాబాగార్డెన్స్: ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మేయర్ పీలా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. జీవీఎంసీలో తన ఛాంబర్లో గురువారం స్వాంతన స్వచ్ఛంద సేవా సంస్థ రూపొందించిన బాల కార్మిక వ్యతిరేక పోస్టర్‌ను మేయర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఏళ్లలోపు పిల్లలంతా చదువుకోవాలని కోరారు. బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన తీసుకురావడానికి ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ కార్మిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ దినోత్సవం నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో స్వాంతన సంస్థ డైరెక్టర్ ఎల్.ప్రజ్ఞాన్ కుమార్, గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

మహిళ వైద్య ఖర్చులకు వాసుపల్లి ఆర్థిక సాయం

దాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఓ పేద మహిళ వైద్యానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసి ఔదార్యం చాటుకున్నారు. ఆశీల్‌మెట్టలోని తన కార్యాలయంలో ఆమె బంధువు నక్కరాజుకు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. వేటాల నూకాలు అనే ఓ పేద మహిళ గర్భాశయ సమస్యతో కంచరపాలెంలోని ఓ ఆస్పత్రిలో చేరారు. మందుల ఖర్చులకు వాసుపల్లిని సాయం కోరగా.. తక్షణమే స్పందించి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ పెరిగిన ధరలతో జీవనమే కష్టంగా ఉన్న పేదలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పేదల గుండె చప్పుడు విన్న డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీని ప్రవేశపెడితే, దానిని రెట్టింపు చేసి జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్ వైద్యాన్ని పేదలకు అందించారన్నారు. అంతే కాక ఆస్పత్రిలో ఉన్న సమయంలో జీవన భృతి అందజేసి పేద కుటుంబాలకు పెద్దన్నగా నిలిచారన్నారు. నేడు కూటమి ప్రభుత్వం పేదలకి జగనన్న అందించిన సంక్షేమానికి తూట్లు పొడుస్తుందని మండిపడ్డారు. పేదవాడికి విద్య, వైద్యం, మౌలిక వసతులు కల్పించలేని చంద్రబాబు ప్రభుత్వానికి పాలించే అర్హత లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, సౌత్ ఆర్‌టీఐ అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్, సౌత్ బూత్ కమిటీ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, ఎర్నిమాంబ ఆలయ చైర్మన్ లండా రమణ, సౌత్ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు బెవర మహేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకుల శ్యామ్, గనగళ్ల రామరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి

రక్తదాన సేవలో సూరాడ కుటుంబం



118 సార్లు రక్తదానం చేసిన సూరాడ అప్పారావు



12వ సారి రక్తదానం చేస్తున్న అప్పారావు కుమారుడు శ్రీరామ్



5వ సారి రక్తదానం చేస్తున్న అప్పారావు కుమార్తె రమాప్రియ



4వ సారి రక్తదానం చేస్తున్న అప్పారావు కుమార్తె రామ్ జనని

దాబాగార్డెన్స్: రక్తదాన సేవలో స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు కుటుంబం మానవత చాటుకుంది. ఇప్పటి వరకు 118 సార్లు రక్తదానం చేసిన సూరాడ అప్పారావును కుటుంబ సభ్యులు ఆదర్శంగా తీసుకున్నారు. కుమారుడు శ్రీరామ్ 12 సార్లు, కుమార్తెలు రమాప్రియా 5 సార్లు, రామ్ జనని నాలుగు సార్లు రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సూరాడ కుటుంబ సభ్యులు రక్తదానం చేశారు.

సైనికుల కోసం..

1999లో కార్గిల్ యుద్ధ సమయంలో గాయపడిన సైనికుల కోసం రాజ్యలక్ష్మి బ్లడ్ బ్యాంక్ ద్వారా రక్తదానం శిబిరం ఏర్పాటు చేసి తొలిసారిగా సూరాడ అప్పారావు రక్తదానం చేశారు. అప్పటి నుంచి వివిధ బ్లడ్ బ్యాంక్‌ల ద్వారా ఏడాదికి 2 సార్లు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. అప్పారావు స్నేహితుని భార్య న్యూ కామియో వ్యాధితో బాధపడతున్నప్పుడు 10 ప్యాకెట్ల రక్తం అవసరమైన నేపథ్యంలో సంస్థ ద్వారా ఆ రక్తాన్ని అందించారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని పిల్లలు సూరాడ శ్రీరామ్, కుమార్తెలు సూరాడ రమాప్రియ, సూరాడ రామ్ జనని రక్తదానం చేస్తూ, సమీప బంధువులచే కూడా రక్తదానం చేయిస్తున్నారు.

ముగిసిన విశ్వేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు



అన్నదానం నిర్వహిస్తున్న పలు దేవాలయాల ఈవోలు

దాబాగార్డెన్స్: సూర్యాబాగ్ మెయిన్‌రోడ్డులో వెలసిన విశ్వేశ్వరస్వామి ఆలయంలో గత ఆరు రోజులుగా నిర్వహిస్తున్న వార్షిక కల్యాణోత్సవాలు గురువారంతో ముగిసాయి. ముగింపును పురస్కరించుకుని మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్లు అడపా దేముళ్లు, దేవదాయ శాఖ ఈవోలు కీర్తి శ్రీనివాసరావు, బొంగరాల మురళీమోహన్‌రావు, దేవస్థానం ప్రధాన అర్చకుడు బాదంపూడి విశ్వేశ్వరశర్మ, భక్తులు పాల్గొన్నారు. పుష్పాంజలి సేవతో ఉత్సవాలు ముగిసాయి.